క్లుప్తంగా...

కాప్రా డీసీని కలిసిన నాచారం బీజేపీ నేతలు



మల్లాపూర్: కాప్రా సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డిని మంగళవారం బీజేపీ నాచారం డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాచారం డివిజన్ పరిధిలోని సమస్యలను ఆయన డీసీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

13న శ్రీనగర్ కాలనీ ఎన్నికలు

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలోని అతిపెద్ద శ్రీనగర్ కాలనీకి గతంలో పని చేసిన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుల కాలపరిమితి ముగియడంతో వారంతా రాజీనామా చేశారని అడ్వైయిజర్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 12న ఆదివారం ఉదయం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కాలనీలోని ప్రతి ఇంటి యజమానులు పాల్గొనాలని వారు కోరారు.

అల్వాల్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత



నిర్మాణాన్ని కూల్చివేస్తున్న అధికారులు

అల్వాల్: నిబంధనలు విరుద్ధంగా నిర్మించిన భవనాన్ని మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేతలు జరిపారు. టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం డివిజన్‌లోని పుదీనతోట జ్యోతినగర్‌లో జీహెచ్‌ఎంసీ నుంచి తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన నాలుగు అంతస్తుల భవనంపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు స్పందించిన అధికారులు మంగళవారం కూల్చివేతలు జరిపారు. అధికారులు సయ్యద్ సయిదుద్దీన్, రాజేందర్‌గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న తాగునీటి పైపులైన్ పనులను మంగళవారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైపులైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్, మేనేజర్ సందీప్, నాయకులు పీఆర్ ప్రవీణ్, మోహన్‌యాదవ్, మునీరుద్దీన్, బాసిత్‌ఖాన్, రఘు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు ఎంతో శ్రేష్టం



ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పరిధిలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. అప్పుడే పుట్టిన పిల్లలకు ముర్రుపాలు ఎంతో శ్రేష్టమని సూచించారు. బిడ్డకు తల్లిపాలనే తాగించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ స్వాతి, సూపర్‌వైజర్ పార్వతి, హెల్త్ అధికారి పద్మ, స్కూల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేడ్చల్: పట్టణంలోని 18వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి ప్రారంభించారు. రూ.10 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు పనులకు ఆమె కౌన్సిలర్ భవాని రాఘవేందర్‌గౌడ్‌తో కలిసి పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. 18వ వార్డును సమస్యలు లేని వార్డుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ విజయలక్ష్మి, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలను ఆదరించిన గద్దర్



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డ్రైవర్ అసోషియేషన్ సభ్యులు

అల్వాల్: అన్ని వర్గాల ప్రజలను ఆదరించిన ఘనత ప్రజా యుద్ధనౌక గద్దర్‌కే దక్కుతుందని అల్వాల్, వెంకటాపురం భూదేవినగర్ ప్రాంత డ్రైవర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఏ.నరేష్ చెప్పారు. భూదేవినగర్ రైల్వే ట్రాక్ పక్కన ఏర్పాటు చేసిన డ్రైవర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్దర్ ఆకస్మిక మరణం పేదలకు తీరని లోటని, పాలమూరు ప్రాంతవాసులు పొట్ట చేత పట్టుకుని నగరానికి వస్తే నేనున్నానంటూ ఆదరించి అక్కున చేర్చుకుని కాపాడుతున్న మహనీయుడు గద్దర్ అని వారు పేర్కొన్నారు. ఆయన మద్దతు ద్వారానే భూదేవినగర్ రైల్వే ట్రాక్ వెంట పాలమూరు గుడిసెవాసులు, వెంకటాపురం డివిజన్‌లో యాదమ్మనగర్ పక్కన సుమారు 500 కుటుంబాలను, గ్రీన్‌ఫీల్డ్స్‌లో 200 మంది కుటుంబాలకు అండగా నిలిచి వారిని కాపాడుతున్న నాయకుడు గద్దర్ అని చెప్పారు. డ్రైవర్ వృత్తిపరమైన పనులు చేసుకుంటున్న తమకు ఒక అసోషియేషన్ ఏర్పాటు చేయించి అండగా నిలిచి ధైర్యం ఇచ్చిన గద్దర్ లేకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు శ్రీరాములు, డ్రైవర్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు స్వామి, ప్రధాన కార్యదర్శి కుమార్, సహాయ కార్యదర్శి రాజు, కోశాధికారి షేక్‌బాబా, కమిటీ సభ్యులు రామకృష్ణ, కుర్మయ్య, వెంకటయ్యతోపాటు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ కుటుంబానికి పరామర్శ



గద్దర్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శిస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

అల్వాల్: ప్రజా గాయకుడు గద్దర్ కుటుంబాన్ని మాజీ మంత్రి పరిటాల సునీత, తెలంగాణ కవి అందెశ్రీ వేర్వేరుగా మంగళవారం కలిసి పరామర్శించారు. వెంకటాపురం భూదేవినగర్‌లోని గద్దర్ నివాసానికి వెళ్లి భార్య విమల గద్దర్, కుమారుడు సూర్యంను పరామర్శించారు. పరిటాల రవితో గద్దర్‌కు ఉన్న అనుబంధాన్ని పరిటాల సునీత గుర్తుచేసుకున్నారు.

గద్దర్ చిత్రపటానికి నివాళి



బోడుప్పల్‌లో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బోడుప్పల్: బోడుప్పల్ కార్పొరేషన్ 15వ డివిజన్ బొల్లిగూడ బాలచిత్తారినగర్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పడతం లోకేష్ ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ రసాల వెంకటేష్‌యాదవ్ మాట్లాడుతూ.. గద్దర్ జీవితం ఎంతో మందికి ఆదర్శమని, తరాలకు ఆయన గుర్తుంటారన్నారు. కార్యక్రమంలో వల్లపు ఐలేష్‌యాదవ్, రాంచందర్, శ్రీనివాస్, వెంకట్రావు, శంకరయ్య, దేవేందర్, గిరి, వెంకటేష్, దామోదర్, చిన్నయ్య, విజయ్‌కుమార్, మల్లేష్, జోసెఫ్, కృష్ణారెడ్డి, మహేష్, శేఖర్, పరమేష్, బాలకృష్ణరెడ్డి, రవీందర్‌రెడ్డి, వినోద్, ప్రవీణ్, కృష్ణ, నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డా క్షేమంగా ఉండాలనే మిషన్ ఇంద్ర ధనస్సు



చిలుకానగర్‌లో తల్లిపాల దినోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: తల్లీ బిడ్డా క్షేమంగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్రంలో మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చిలుకానగర్ డివిజన్‌లో మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం తల్లీబిడ్డల యోగక్షేమాల కోసం నిత్యం పాటుపడుతోందన్నారు. ఆశ వర్కర్ల ద్వార సర్వే చేయించి వాక్సినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, వైద్యకేంద్ర సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి సహకారం అందించాలి



డీసీ శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ఆదర్శ వెల్ఫేర్, ఆనంద్‌రావునగర్ కాలనీ వాసులు

అల్వాల్: అల్వాల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి అల్వాల్ ఆదర్శ వెల్ఫేర్ అసోసియేషన్ ఆనందరావునగర్, ఓల్డ్ అల్వాల్ అసోషియేషన్ల కాలనీవాసులు మంగళవారం సర్కిల్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కాలనీల అభివృద్ధి పనుల్లో సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మీవంతు సహాయంగా కాలనీ అభివృద్ధికి సహకారం అందించాలని డీసీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో హరిబాబు, అయ్యగారి శ్రీనివాసరావు, లారెన్స్, సత్యాశ్రీలన్, నరహరి, సుందర్‌రాజ తదితరులు ఉన్నారు.

సోనియాగాంధీ నగర్‌లో దొంగల హల్‌చల్

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలోని సోనియాగాంధీనగర్ కాలనీలో రాత్రి సమయంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారని కాలనీవాసులు అంటున్నారు. మూడు నెలల్లో ఆరు ఇళ్లలో దొంగతనం జరిగిందని తెలిపారు. రాత్రి సమయాల్లో కాలనీలో సంచరిస్తూ తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. వారి కదలికలు కాలనీలోని పలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయన్నారు. అంతేగాకుండా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ఇళ్ల ముందు మత్తు పదార్థాలను తీసుకుంటూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఘటనలు కూడా తరచూ చోటు చేసుకుంటున్నట్లు తెలిపారు. కుషాయిగూడ పోలీసులు స్పందించి రాత్రి సమయంలో గస్తీ పెంచడంతో పాటు ప్రత్యేక దృష్టి సారించి దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ప్రజల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ పార్టే..



కరపత్రం అందజేస్తున్న నందికంటి శ్రీధర్

మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీగా వారి సంక్షేమానికి పాటుపడుతుందని డీసీసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ జవహర్‌నగర్‌లో కాలనీ నేస్తం.. కాంగ్రెస్ హస్తం కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి మేడిపండు చందంగా ఉందన్నారు. కేసీఆర్ వాస్తవాలను దాచి ప్రజలను మభ్యపెట్టి అబద్ధపు మాటలతో మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందని, ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు ఉమేష్‌సింగ్, బీకే శ్రీనివాస్, సూర్యప్రకాష్, మజీద్, గుత్తి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

సన్‌సీడ్‌లో ఉయ్యాల పథకం

కుషాయిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కేసీఆర్ కిట్ పథకాన్ని ఆదర్శంగా తీసుకొని కుషాయిగూడలోని సన్‌సీడ్ ఆసుపత్రి యజమాన్యం సన్‌సీడ్ ఉయ్యాల పథకానికి శ్రీకారం చుట్టింది. ఆసుపత్రిలో ప్రసూతి అయిన ముగ్గురు మాతా శిశువులకు మంగళవారం సుమారు రూ.6 వేల విలువ చేసే ఉయ్యాల, తల్లి, శిశువులకు న్యూట్రీషన్ కిట్‌లను ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ అన్వేష్ కల్యూరి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తేజస్విని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే గర్భిణలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రసూతి కోసం ఆసుపత్రికి వచ్చే వారికి 30 శాతం డిస్కౌంట్ సదుపాయం కల్పించినట్లు వెల్లడించారు. డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ లావణ్య, డాక్టర్ వైష్ణవి, సీఈఓ కల్యూరి రాములు తదితరులు పాల్గొన్నారు.



సన్‌సీడ్ ఉయ్యాల కిట్‌ను అందజేస్తున్న డాక్టర్ అన్వేష్, డాక్టర్ తేజస్విని

మౌలిక వసతుల కల్పనకు కృషి



యూజీడీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: మౌలాలి డివిజన్ సూర్యనగర్‌లో మంగళవారం రూ.8 లక్షలతో చేపడుతున్న యూజీడీ పనులను కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వేణు, శరత్, శ్రీను, నటరాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ చేసిన దొంగ అరెస్ట్



జంపన్న

మల్కాజిగిరి: దుర్గాభవానీ దేవాలయంలో చోరీకి పాల్పడిన నిందితుడిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఏసీపీ నరేష్‌రెడ్డి, సీఐ రవికుమార్, డీఐ జగన్నాథ్ తెలిపిన వివరాలప ప్రకారం.. ఈనెల 5వ తేదీన గౌతంనగర్ రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న దుర్గాభవానీ దేవాలయంలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు చోరీకి గురైనట్లుగా దేవాలయం కమిటీ అధ్యక్షుడు పూజారి వెంకటరమణ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీలు, పాత నేరస్తులపై నిఘాతో ఈ నెల 8వ తేదీ మల్కాజిగిరిలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న సికింద్రాబాద్ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సంగెం జంపయ్య అలియాస్ జంపన్న(28)ను అదుపులోకి తీసుకొని విచారించడంతో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి 72 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.7 వేల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గతంలో గోపాలపురం, మారేడ్‌పల్లి, లాలాగూడ పోలీస్ స్టేషన్లతో పాటు సికింద్రాబాద్‌లో ఏడు కేసులు ఉన్నాయని వారు తెలిపారు.

పనులు పూర్తి చేశారు.. వ్యర్థాలు మరిచారు..



ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

రామంతాపూర్: పెద్ద చెరువు నుంచి వచ్చే వరద నీటిని తరలించడానికి నిర్మించిన ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులు స్థానిక గాంధీనగర్‌లో పూర్తయిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నాలా చుట్టూ పక్కల మట్టి దిబ్బలు, రాళ్ళు వ్యర్థాలు రోడ్డు మీదే వదిలేయడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ మంగళవారం స్థానిక సీపీఎం నేతలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఉప్పల్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ గాంధీనగర్ నుంచి చర్చి కాలనీకి ఉప్పల్ ఇండస్ట్రీయల్ ఏరియాకు వెళ్లే వాహనదారులు, పాదచారులు రెండు కిలో మీటర్ల దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని, వెంటనే మట్టిదిబ్బలను ఎత్తివేయాలని, లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కిరణ్ కుమార్, శ్రీనివాసులు, రామకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని సందర్శించిన అధికారులు



మిర్జాల్‌గూడలో పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసి అధికారులు

గౌతంనగర్: మిర్జాల్‌గూడ చిన్మయిమార్గ్‌లో ఉన్న పార్కు స్థలాన్ని మంగళారం మల్కాజిగిరి సర్కిల్ అధికారులు సందర్శించారు. కొంతకాలంగా పార్కు స్థలం విషయం న్యాయస్థానంలో ఉంది. కాలనీలో పార్కు స్థలాన్ని పరిరక్షించి కాలనీవాసులకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని మిర్జాల్‌గూడ చిర్మయిమార్గ్ అసోసియేషన్ వాసులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం జీహెచ్‌ఎంసీ ఏఈ దివ్యజ్యోతి, టౌన్‌ప్లానింగ్ అధికారులు, జలమండలి అధికారులు పార్కు స్థలాన్ని పరిశీలించారు.



భోగారం చౌరస్తాలో ధర్నా



భోగారం చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నేతలు, బర్సిగూడ గ్రామ రైతులు

కీసర: బర్సిగూడ గ్రామానికి రెవెన్యూ నక్షతో పాటు రైతుపాసు బుక్కులు అందజేయాలని మంత్రి మల్లారెడ్డిని అడిగినందుకు ఆయన రైతులను క్షించపరిచే విధంగా మాట్లాడంతోపాటు బెదిరింపులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని, బీజేపీ రాష్ట్ర నేత భోగారం ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు సుంకర జైహిందర్‌రెడ్డి ప్రశించారు. మంగళవారం మంత్రి మల్లారెడ్డి పాదయాత్రలో భాగంగా భోగారంలో పర్యటిస్తుండగా బర్సిగూడ గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ గ్రామానికి నక్షతో పాటు రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఎందుకు ఇవ్వడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇదేవిషయమై మంత్రి మల్లారెడ్డి రైతులను బెదిరించేలా మాట్లాడారని బీజేపీ, కాంగ్రెస్ నేతలు గ్రామ చౌరస్తాలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు, బర్సిగూడ గ్రామ రైతులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రికి ఏర్పాట్లు ప్రారంభించాలి



వినతిపత్రం అందజేస్తున్న భాగ్యనగర్ ఉత్సవ సమితి నాయకులు

మల్కాజిగిరి: రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాట్లు ప్రారంభించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మల్కాజిగిరి అసెంబ్లీ కన్వీనర్ ఉడుత నవీన్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి సర్కిల్ డీసీ జి.రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహాలను తరలించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని, రహదారుల మరమ్మతులు చేపట్టాలని కోరామన్నారు. నిమజ్జన ఘాట్స్ వద్ద ఇప్పటి నుంచే పనులు ప్రారంభించాలని, అన్ని విభాగాల అధికారులు, మండలపాల నిర్వాహకులు, రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో దాసన్, అఖిల్‌సింగ్, సుశీల, అభిలాష్, అవినాష్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం

– మేయర్ కావ్య



జవహర్‌నగర్: హరితహారంలో భాగంగా జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ శాంతినగర్‌లో మంగళవారం మేయర్ కావ్య మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హరితహారంతో జవహర్‌నగర్ పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడిందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం సుమారు 1800 మొక్కలను కాలనీవాసులకు ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నాగభూషణం, వార్డు కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయం



దివ్యాంగుడిని సన్మానిస్తున్న కార్పొరేటర్ నిహారికగౌడ్, కిరణ్‌కుమార్

జవహర్‌నగర్: పేదరిక నిర్మూలనకు స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయమని 28వ డివిజన్ కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్ అన్నారు. దివ్యాంగుల హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మెరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో శ్రీహర్షిణి ఫౌండేషన్ సహకారంతో మంగళవారం జవహర్‌నగర్‌కు చెందిన దివ్యాంగుడికి ఏర్పాటు చేసిన పాన్‌షాప్, కిరాణషాపును కార్పొరేటర్ నిహారికగౌడ్, దివ్యాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. నాయకులు సంపత్‌కుమార్, శ్రీనివాస్, సాంబయ్య, అప్పారావు, సుగుణ, మహేష్, బబ్లూ, పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులు ప్రజల్లో ఎప్పటికీ గుర్తుండిపోతారని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మూడున్నర ఏళ్లు నాగారం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించి ఇటీవల స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా మీర్‌పేట కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లిన నాగారం మున్సిపల్ కమిషనర్ వాణీరెడ్డికి వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందంజలో తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి మున్సిపల్ శాఖ నుంచి పలు అవార్డులు సాధించడంలో కమిషనర్ వాణీరెడ్డి పాత్ర మరువలేమన్నారు. మున్సిపల్ పాలకవర్గం సభ్యులందరినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించారన్నారు. ఆమె మున్ముందు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని అభిలాషించారు. వాణీరెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంలో నాగారం మున్సిపాలిటీని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లినట్లు చెప్పారు. అంతకుముందు నాగారం మున్సిపాల్ పాలకవర్గం ఆధ్వర్యంలో వాణీరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, నాగారం మున్సిపల్ కొత్త కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, గూడురు సబితాఆంజనేయులుగౌడ్, కౌకుట్ల మమత, కౌకుట్ల అనంతరెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, దివ్యదయాకర్‌రావు, సుర్వీ శ్రీనివాస్, కొమురెల్లి అనితా, మోకు రేణుక, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంగ హరిబాబు, నాగేష్‌గౌడ్, సరితారమేష్, ప్రియాంక, అన్నంరాజు లావణ్య, లక్ష్మీ వేణుగోపాల్, సుమిత్రసురేష్, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ నేతలు గూడురు అంజన్న, మోకు జగన్ మోహన్‌రెడ్డి, కౌకుట్ల కృష్ణారెడ్డి, అన్నంరాజు శ్రీనివాస్, కొముర్రెల్లి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.